ప్రచురణ తేదీ : 10-31-2021 రచయిత పేజీని సమర్పించినవారు:

# మాహెజబీన్

## వెజైనా మోనోలాగ్ (కవిత)

అమానుషంగా ముగిసిన శోకతప్త వెజైనా కథ నాది

ద్రౌపది వస్త్రాపహరణం నుండి
ఛిద్రమైన నా వెజైనా దాకా
నడిచింది స్త్రీల అవమానాల చరిత్రే కదా
ఇనుప కచ్చడాల నుండి బికినీ దాక
సాగిన నాగరిక ప్రయాణం లో
లైంగిక దోపిడీ తప్ప మరింకేమి లేదు
మను ధర్మశాస్త్రం నుండి వర్తమానం దాక
వెంటాడి వేధించే Sexist Perspective

నేను మనిషిగా కాకా అవయవంగా కనిపించాను
నా శరీరం వాళ్లకు వెజైనాగా కనిపించింది
నా మీద లైంగిక దాడి జరుగుతున్న క్షణాన
నేను తుమ్మ ముల్లునై వాళ్లకు గుచ్చుకోవాలని అనుకున్నాను
నా దేహమంతా సూదులు మొలవాలని కోరుకున్నాను
విషకన్యను కానందుకు చింతించాను

రుతువులో మాత్రమే ఎర్రబారే నేను
ఆ రోజు వాళ్ళ వల్ల నెత్తురు ముద్ద నయ్యాను
నా వెజైనా మీద హింస పరాకాష్టకు చేరుకున్న
ఆ అవాంఛిత విషాద సమయంలో
నేను అస్తిత్వం కోసం ప్రతిఘటించాను
పోరాడి, గాయపడి, చివరికి ముగిసిపోయాను

నా రాజ్యమా!
నువ్వు, నీ సెక్యూరిటీ కలిసి
ఒక చిన్న వెజైనాను రక్షించలేకపోయాయి
Shame on you

అశ్రు నివాళి బరువెక్కిపోయింది
Don't Cry for me India
బతికున్న నీ ఆడ పిల్లల కోసం కన్నీళ్లు పెట్టు
నా కోసం చాలు

ఈ వ్యవస్థ ముఖం మీద
నా సిగ్గు బిళ్ళను విసిరేసి వెళ్తున్నాను
అత్యాచారాల చరిత్ర పేజీ లేని నేల మీద
మళ్ళీ వెజైనాతో పుట్టాలని వుంది
మళ్ళీ మళ్ళీ స్త్రీగానే!